# గుండుసూది

–అరుణప్రియ, N.Brunswick, NJ

నాంది:

అనగా అనగా అనేటంత వెనక్కి చరిత్రలోనికి వెళ్ళినట్టయితే మనకి ఆ రాజ్యం తప్పక కనిపిస్తుంది. ఎంత సుభిక్షమయిన రాజ్యం. ప్రజలందరూ ఎవరి పనులను వారు చేసుకొంటూ ప్రశాంతంగా జీవిస్తూ వుంటే ఎక్కడ నుండి ఊడిపడ్డాడోగానీ ఓ ఆగంతకుడు. పడ్డవాడు పడ్డట్టు ఉన్నాడా? లేడే! రాజ్యం అంతా తిరగడం మొదలెట్టాడు. తిరుగుతూ తన వెంట తెచ్చిన వస్తువుల నన్నింటినీ ప్రదర్శన కూడా చేసాడు. ప్రజలందరూ వెర్రిగా వాడినీ వాడి వస్తువులనీ చూడ్డం, చూసి ఆనందించడం మొదలు పెట్టారు. అన్నిటికన్నా వెధవది అదే దాన్ని వాడు ఏదో అన్నాడు కానీ మనవాళ్ళు మాత్రం గుండుసూది అన్నారు. చూసి అచ్చెర్లు వందారు, మెచ్చుకొన్నారు. 'ఆహా! ఏం మెరుపు! ఏం పనితనం! మనమూ ఉన్నాము దబ్బలాలూ, దారాలూనూ. ఇది ఎంచక్కా ఇముడుతోంది, కాగితాలను ముచ్చటగా జత పెడుతోంది కదూ' అని ఇలా రకరకాలుగా చెప్పుకొంటూ ఇంటే చివరికి రాజావారికి కూడా దాన్ని చూడాలని ఆశ కల్గింది. చూసారు, ఇకనేం కావాలీ అన్నారు, తెప్పించమన్నారు, కనుక్కు రమ్మన్నారు. ఈయనగారికి కావాలి కాబట్టి ఇన్నీ అనేసారు కానీ అవతలి వాళ్ళం వెర్రివాళ్ళా ఊరకనే ఇచ్చేడానికి. ఈయన, అదే మా రాజుగారు, మాకు రాజుగారు గాని వాళ్ళకి కాదు కదా! అందునా చేత సరకుంది. అవి కావాలో అన్నవాళ్ళున్నారు. రహస్య మంతనాలు అయ్యాక చివర తేలిందేమిటంటే రాజుగారు, పరదేశి ఒక ఒప్పందానికి వచ్చారనీ, ఆ ఒప్పందం ప్రకారం వారు మనకు తయారైన గుండు సూదులివ్వడం విపరి మనం సగం బంగారం రూపంగానూ, సగం సుగంధాల రూపంలోనూ చెల్లించుకోవడం అన్నమాట! సరే అన్నారు అంతా. గుండు సూదుల రాక బంగారు సుగంధాల పోక ఆర్భాటంగా మొదలై చల్లగా కొనసాగింది.

సింహావలోకనం:

నల్లేరు మీద బండిలా ఈ ఒప్పందం సాగుతూంటే మా మంత్రిగారు ఊరుకున్నారా? లేదే! ఆలోచించి, ఆలోచించి ఇలా ఎంతకాలం కొనసాగగలదని తర్కించుకొని మెల్లిగా రాజు చెవిన వేసాడు కానీ షరా మామూలే. రాజు దాన్ని పెడ చెవిన వేసాడు. మంత్రిగారు భయపడ్డంతా జరిగింది. అట్టే బంగారం రాజు దగ్గర లేదని పరదేశి పొరుగు రాజ్యపు సైన్యాన్ని పురిగొల్పాడు. అసలే పొరుగు రాజ్యం వారు ఈ రాజు మీద అసూయలో ఉన్నారు కదా! అందుచేత అందరూ కలసి మా రాజును పదవీ భ్రష్టుడిని చేసి తామే ఏలడం మొదలు పెట్టారు. రాజ్యంలో అల్లకల్లోలం రాకుండా ఉండేందుకు పరదేశీ, పొరుగు రాజులూ ప్రజలకు గుండుసూదులకు మాత్రం ఏమాత్రం లోటు వుండదని బహిరంగంగా ప్రకటించారు. అందుచేత ప్రజలు రాజు లేకపోతే పోయాడు గానీ గుండుసూదులు పుష్కలంగా దొరుకుతున్నాయిలే అని సరిపుచ్చుకున్నారు. గుండుసూదులైతే వస్తున్నాయి కాని వాటి తయారీ మాత్రం ఇంకా రాలేదు.

చివరికి ఏమైతేనేం మా ప్రజల అదృష్టమో లేక పొరుగు రాజుల అంతఃకలహాలో కాని మరలా మా రాజే మాకు ప్రభువైనాడు. అయితే మారాజుకి గుండుసూదిమీద మమకారం మాత్రం పోలేదు. 'ఇన్ని పంటలు పండుతున్నాయి, ఇన్ని వసతులు ఉన్నాయి, ఇన్ని ఖనిజాలు ఉన్నాయి, ఇంతమంది మేధావులు ఉన్నారు కానీ గుండుసూది తయారీ మాత్రం లేదని' మధన పడుతూంటే, ఇలాటిదేదో జరుగుతుందని కలగన్నట్టు ఒకడు ఓ ఒడ వేసుకొని ఒడ్డున దిగాడు. దిగి రాజుతో సంప్రదింపులు సలిపాడు. పచ్చిమాంసం తింటేతిన్నాడు గాని ఏం ముఖ వర్చస్సు. ఏ అవధూతో అనుకొని కొంతమంది భ్రమ పడ్డారు కూడా. త్వరలో వాడికీ మా గుండుసూది కథ తెల్సింది. వాడే చొరవ తీసుకొని అన్నాడు కదా 'రాజా మీకు గుండుసూది కార్ఖానా తెప్పించే పూచీ నాది, కాకపోతే పెద్దపని కాబట్టి కొంచెం సమయం పడుతుంది.' గుండుసూదే కాకుండా కార్ఖానా కూడా అంటున్నాడు, ఎంత మంచి మనస్సు అని రాజు మురిసిపోయాడు. సరేనన్నాడు. వాడు గుండుసూదీ తెచ్చాడు, గుండుసూదికన్నా తేలికైన గరళాన్నీ తెచ్చాడు. బరువైన గుళ్ళనీ తెచ్చాడు. తెచ్చిన వాటిని దేనినీ ఊరకనే కూర్చోపెట్టలేదూ తానూరికే కూర్చోనూ లేదు. ఇంకేం ఈ రాజెందుకన్నాడు. అన్నవాడు అన్నట్టే రాజునీ రాజ్యాన్నీ మింగేశాడు. మొత్తానికి రాజ్యం పోయింది కానీ కార్ఖానా మాత్రం రాలేదు సరికదా వీడు గుదిబండై కూర్చున్నాడు. ప్రజలకి ఇక వాడిలో వర్చస్సూ కనబడ లేదు, గుండుసూది కార్ఖానా రాక అసలే కనబడ లేదు. దాంతో తిరగ బడ్డారు, దెబ్బలు తిన్నారు, మరణించారు. కొన్నాళ్ళకి వాడికి ఈ వ్యాపారం నష్టంలోకి నడుస్తోందని తెల్సి, తను పీల్చి పిప్పి చేసిన మా రాజ్యాన్ని వద్దని వెళ్ళిపోయాడు. గుండుసూది తయారీని ఇవ్వలేదు సరిగదా పోతూపోతూ గుండుసూది తల గుండ్రంగా ఉండాలని కొందర్నీ, కోలగా ఉండాలని కొందర్నీ పురిగొల్పి విడగొట్టి మరీ వెళ్ళిపోయాడు.

ఉపసంహారం:

ఎలాగైతేనేం మాకు ఇంక ఏ రాజులూ వద్దు మమ్మల్ని మేమే ఏలుకొంటాం అని నిర్ణయించుకొని కొందరు పాలకుల్ని ఎన్నుకొన్నాం. ఆశ్చర్యం ఏమంటే గుండుసూది ఉత్పాదన గూర్చి చర్చలు మరలా మొదలు! అసలు ఉత్పాదకత పెరగాలంటే మన పొరుగు దేశాన్ని చూడండి అన్నారు. వారి త్యాగల్ని చూడండి అన్నారు. (అసలు అదొక దౌర్భాగ్యపు దేశం, పైకి రావడం కోసం ప్రజల్ని చావగొట్టి దాన్ని త్యాగం అన్నారు, నోరు నొక్కి క్రమశిక్షణ అన్నారు.) మనమూ త్యాగాలు చేయాలీ అన్నారు (వాళ్ళలాటి త్యాగాలు కాదులెండి, ఇంకా నయం!) కొద్దిమంది మాత్రం మా పొరుగు దేశపు శత్రువులను అనుకరించి ఉత్పాదకతనం పెంచే మార్గాలను తెలుసుకొన్నారు. వారినీ మా ప్రజా ప్రభుత్వమే పర్యవేక్షించింది లెండి. ఇంతలో హఠాత్తుగా ఓ వింత జరిగింది. మా పొరుగుదేశపు పాలకుడు తనూ తన ప్రజలూ ఈదుతున్నది గోదావరి కన్నా పెద్ద మహా నదనీ, ఆసరాగా పట్టుకొన్నది మాత్రం కుక్కతోక కన్నా గొప్పదేమి కాదనీ గ్రహించాడు. అంతటితో ఆగకుండా దాన్ని ఢంభా కొట్టి చెప్పాడు. స్వతఃగా ఈదడం నేర్చుకోమనీ, ఈలాటి కుక్కలతోను ఆసరాగా పట్టుకోవద్దనీ కూడా చెప్పాడు. కాకపోతే మారాజ్యంవారు కూడా ఈ గ్రహింపుని అర్థం చేసుకొంటే బాగుండునేమో కానీ అలాటిదేమి జరగలేదు.

స్వగతం:

వీళ్ళు సంభాషణలు మాని స్వతఃగా ఈదడం, ఆవలి ఒడ్డుకి చేరడం, గుండుసూది తయారీ మొదలు పెట్టడం ఇవన్నీ సాధ్యమేనా? మావాళ్ళు గత చరిత్ర అంతా చూసిన నాకు ఇదంతా వర్తమానంలో సంభవమేనా అని అప్పుడప్పుడు అనిపిస్తూంటుంది. చాలా విషయాలు మనకి అనిపిస్తాయి. అనిపించినంత మాత్రాన వాటికి సమాధానం ఉందనీ చెప్పలేం, లేదనీ చెప్పలేం, ఉన్నా ఎప్పుడు తెలుస్తుందని కూడా చెప్పలేం.

---

ఏ దేశ మేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని

—రాయప్రోలు సుబ్బారావు